# ధ్యాన జగత్

నవ్యయుగ ధ్యాన - ఆధ్యాత్మిక మాసపత్రిక



## ధ్యానం.. ధ్యానం.. ధ్యానం

సెప్టెంబర్ 2015

రూ. 30/-

# 163 సంచికలతో 14 సంవత్సరాల మహాప్రస్థానం

బ్రహ్మర్షి పత్రీజీ మానస పుత్రిక



# ధ్యానాంధ్రప్రదేశ్

నవ్యయుగ ధ్యాన - ఆధ్యాత్మిక మాసపత్రిక



డిసెంబర్ 2001 నుంచి ఆగస్ట్ 2015 వరకు..

www.pssmovement.org

ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస

email.dhyana1991@gmail.com

సెప్టెంబర్ సంచిక ముఖచిత్రం : శ్రీమతి స్వర్ణమాల పత్రి

ఫొటో సౌజన్యం : నవీన్ అప్పిరాజు

# ధ్యాన జగత్

నవ్యయుగ ధ్యాన-ఆధ్యాత్మిక మాసపత్రిక



వ్యవస్థాపకులు : బ్రహ్మర్షి పత్రీజీ

సంపుటి .. 1 సెప్టెంబర్ .. 2015 సంచిక .. 6



పబ్లిషర్/ఫైనాన్స్
D. కేశవరాజు



చీఫ్ ఎగ్జిక్యూటివ్
D. శివప్రసాద్



చీఫ్ ఎడిటర్
M. స్వర్ణలత



ఎడిటర్
T. వాణి



ప్రొడక్షన్
D. సర్వేష్



DTP
V.సురేష్



అడ్మినిస్ట్రేషన్
U. వెంకటేష్



రిసెప్షన్
B. నాగప్రసన్న

| విషయం | | పేజీ |
|---|---|---|
| " ధ్యాన జగత్ జిందాబాద్ " | - బ్రహ్మర్షి పత్రీజీ | 5 |
| " పత్రీజీ జ్ఞానం .. ఆకాశమంత విశాలం " | - స్వర్ణమాల పత్రి | 7 |
| " విశ్వనియమాలను ఖచ్చితంగా .. " | - బ్రహ్మర్షి పత్రీజీ | 12 |
| " మౌనధ్యాన సాధన " | - K.లోకేనాథ్ రెడ్డి | 14 |
| " పిరమిడ్ ధ్యానుల శ్రీలంకయాత్ర-2015 " | - D.మల్లీశ్వరి | 19 |
| " విశ్వాసం - విశ్వాస పరులు " | - Ruzbeh N.Bharucha | 22 |
| " పిరమిడ్ కాస్మిక్ వ్యాలీ " | - నలజాల సరోజ | 24 |
| " ధ్యాన జగత్ సమాచారం " | - ఆగస్ట్ 2015 | 27 |
| " రాయలసీమ ధ్యాన జ్ఞానయాత్ర " | - Ch.శ్రీనివాసులు | 32 |
| " ఆస్ట్రేలియా దేశంలో ధ్యానప్రచారం " | - D.శివప్రసాద్ | 35 |
| " చైతన్య క్రమం " | - శ్రీచందన తిరునగరి | 45 |
| " కైలాసపురి ప్రాంగణంలో .. " | - P.దామోదర్ రెడ్డి | 48 |
| " నరుడైతే దుఃఖం- నారాయణుడైతే .." | - P.రాంబాబు దంపతులు | 51 |
| " పత్రీజీ టూర్ డైరీ " | - ఆగస్ట్ 2015 | 59 |
| " అమర్‌నాథ్ ధ్యానయాత్ర " | - M.శివగణేశ్వరరావు | 69 |
| " అమెరికాలో ధ్యానప్రచార భేరి " | - D.పుష్పావతి | 73 |
| " ధ్యాన జగత్‌ను ప్రతి ఒక్కరికీ .. " | - D.కేశవరాజు | 75 |

ఇంకా .. ధ్యానప్రచార విశేషాలు, ధ్యానానుభవాలు ..



e-mail : dhyana1991@gmail.com
www.pssmovement.org

printed and published by D. Kesava Raju
16-11-511/D/247, Shalivahananagar, Moosarambagh, Hyd-36
printed at Kala Jyothi Process Pvt. Ltd.

విడి ప్రతి : రూ॥ 30 సంవత్సర చందా : రూ॥ 300

పత్రికలో ప్రచురింపబడిన అంశాలు రచయిత/రచయిత్రుల స్వంత అభిప్రాయాలు మాత్రమే; వాటిపై పత్రికయాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు

ప్రధాన కార్యాలయం
16-11-511/D/247 .. శాలివాహన నగర్, మూసారాంబాగ్,హైదరాబాద్ - 36
ఫోన్స్ : 70754 67755, 92463 37630

ఎడిటోరియల్
T. వాణి

# " బహుమతులు "

" బీదవాడిని బాబయ్యా ! తిండి తిని రెండు రోజులయ్యింది .. కనికరించండి " అంటూ దీనంగా అడుక్కుంటూన్న భిక్షగాడిని చూసి తన స్నేహితునితో కలిసి ఆ దారెంట వెళ్తూన్న ఒకానొక పెద్దమనిషి కరిగిపోయాడు !

తన దగ్గర ఉన్న ఒక బంగారు నాణాన్ని అతనికి ఇచ్చి " అడుక్కోవడం మానేసి దీనిని అమ్ముకుని వచ్చిన డబ్బుతో ఏదైనా వ్యాపారం చేసుకుని గౌరవంగా బ్రతుకు " అని చెప్పాడు.

చేతిలో ఉన్న బంగారు నాణాన్ని చూసి ఉబ్బి తబ్బిబ్బవుతూ ఇంటికి బయలుదేరిన భిక్షగాడిని దారిలోనే ఒక దొంగ అటకాయించి దానిని కాజేశాడు. చేతికి అందిన అదృష్టం క్షణంలో మాయం అయినందుకు ఆ రాత్రంతా బాధపడి ఏం చెయ్యలేక మర్నాడు యధావిధిగా తన స్థానంలో కూర్చుని అడుక్కోసాగాడు భిక్షగాడు !

తన స్నేహితునితో కలిసి అదే దారంట వచ్చి అక్కడ భిక్షగాడు మళ్ళీ అడుక్కోవడం చూసి ఆశ్చర్యపోయిన పెద్దమనిషి .. బంగారు నాణెం దొంగ పాలు అయినందుకు బాధపడి .. కోట్ల విలువ చేసే ఒక వజ్రాన్ని అతని చేతిలో పెట్టి " ఈసారి అయినా దీనిని జాగ్రత్తగా అమ్మి ఆ డబ్బుతో గౌరవంగా బ్రతుకు " అని అతడి భుజం తట్టి వెళ్ళిపోయాడు !

వజ్రాన్ని జాగ్రత్తగా తీసుకెళ్ళి .. ఇంట్లో ఉన్న ఒక పాత కుండలో భద్రపరచి " దీనిని అమ్మి .. వచ్చే డబ్బుతో ఏం వ్యాపారం చెయ్యాలా! " అని కలలు కంటూ పడుకున్నాడు భిక్షగాడు.

మర్నాడు తెల్లవారుజామునే నీళ్ళ కోసం చెరువుకు బయలుదేరిన అతని భార్య పాపం రోజూ వాడే కుండ పగిలిపోవడంతో భిక్షగాడు వజ్రాన్ని దాచిన పాతకుండను తీసుకెళ్ళి చెరువులో ముంచి .. నిండు కుండతో తిరిగి వచ్చింది.

తెల్లవారాక లేచి ఆత్రంగా పాత కుండ కోసం వెతికిన భిక్షగాడు .. వజ్రం చెరువు పాలయ్యిందని తెలుసుకుని లబోదిబోమన్నాడు !!

మర్నాడు యధావిధిగా తన స్థానంలో కూర్చుని దీనంగా అడుక్కుంటూన్న భిక్షగాడిని చూసి బాధపడిన పెద్దమనిషిని వారిస్తూ అతని స్నేహితుడు .. ఈసారి తన దగ్గర ఉన్న **రెండు రూపాయల**ను అతనికి దానం చేశాడు !

**రెండు రూపాయల**తో తన కడుపుతో పాటు ఇంట్లో వాళ్ళందరి కడుపులు ఎలా నింపాలో పాలుపోని భిక్షగాడు బాధగా చెరువు గట్టుపైన నడుస్తూ .. అక్కడ చేపలు పట్టే వాళ్ళ గాలం నుంచి తప్పించుకుని ఒక చేప ఒడ్డున పడి గిలగిలా కొట్టుకుంటూ ఉండడం చూశాడు.

" దీనిని కొని చెరువులో వదిలితే పాపం మళ్ళీ అది నీళ్ళలో హాయిగా బ్రతుకుతుంది " అనుకుని తన దగ్గర ఉన్న రెండు రూపాయలతో దానిని కొని ప్రేమగా నీళ్ళలో వదిలాడు.

అంతే ! చెరువులో ఈదడానికి బదులుగా నీళ్ళల్లో పైకీ క్రిందికీ గిలగిలా కొట్టుకుంటూన్న చేప నోట్లో తళతళా మెరుస్తూన్న వజ్రాన్ని చూసి ఆశ్చర్యపోయాడు!

దానిని బయటికి తీసి ఆనందంతో ఇంటికి బయలుదేరిన భిక్షగాడికి దారిలో అంతకు మునుపు అతని బంగారు నాణాన్ని ఎత్తుకెళ్ళిన దొంగ ఎదురై .. అతడు చుట్టుప్రక్కల వారిని పిలుస్తాడేమో అన్న భయంతో బంగారు నాణేన్ని భిక్షగాడి చేతిలో పెట్టి పారిపోయాడు!!

❖ ❖ ❖

మన కోసం మాత్రమే మనం ఆలోచించినంత కాలం మన జీవితం ఎక్కడ వేసిన గొంగళి అక్కడిలాగే ఉంటుంది! కాస్త మన ఆలోచనలను తోటి ప్రాణికోటి మీదకు మళ్ళించి దైవప్రణాళికతో గనుక చేతులు కలిపామా .. ఇక అప్పుడు విశ్వం మనకు అందించే బహుమతులు మన అంచనాలకు కూడా అందవు !

బ్రహ్మర్షి పత్రీజీ

# " ధ్యాన జగత్ జిందాబాద్ "

1990 సంవత్సరం లో రూపుదిద్దుకుని ధ్యానప్రచారాన్ని ఒక ఉద్యమంలా ప్రజల్లోకి తీసుకుని వెళ్తోంది ***పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్.***

అందులో భాగంగానే 2001 డిసెంబర్ నుంచి ధ్యాన జ్ఞాన ప్రచారంలో అత్యంత ముఖ్య భూమికను పోషిస్తోంది నవ్యయుగ ధ్యాన ఆధ్యాత్మిక మాసపత్రిక ***" ధ్యానాంధ్రప్రదేశ్ " !***

హైదరాబాద్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ ***" P.ప్రసాద్ "*** గారిచే ప్రారంభించబడి మరి సీనియర్ పిరమిడ్ మాస్టర్ ***P.రమాదేవి*** మరి ***T.మురళీధర్*** గార్ల సారథ్యంలో రూపుదిద్దుకుని 2011 వరకు దాదాపుగా ప్రతి పిరమిడ్ మాస్టర్ ముంగిట్లోకి చేరింది!

2011 ఫిబ్రవరి నుంచి తిరుపతి సీనియర్ మోస్ట్ పిరమిడ్ మాస్టర్ ***" ధ్యానరత్న" D.కేశవరాజు*** గారి సారథ్యంలో మరిన్ని హంగులను పొందుతూ ***PSSM*** కీర్తి కిరీటంలో ఒక ***కోహినూర్ వజ్రం***లా మెరుస్తోంది!

చక్కటి మార్కెటింగ్ నెట్‌వర్క్‌తో కూడి మరింత మరింత మంది పిరమిడ్ మాస్టర్లకు ఆత్మీయురాలిగా మారడమే కాకుండా సమాజంలోని ఇతర రంగాల ప్రజలందరికీ చేరువ అయ్యింది.

ఈ విశేష పత్రికకు ఎడిటర్లుగా ఆనాటి నుంచి ***T.మురళీధర్ .. Y.జయశ్రీ .. B.V.రమణ .. P.ప్రసాద్ .. D.శివప్రసాద్ .. B.నాగలక్ష్మి*** మరి ఇప్పుడు ***T.వాణి*** గార్లు తమ తమ సృజనాత్మకతను పత్రికకు జోడిస్తూ దానిని మరింత సర్వాంగసుందరంగా తీర్చి దిద్దుతూ ఏకధాటిగా ***" 163 సంచికలను "*** అందించడం అద్భుతమైన విషయం!

ఈ క్రమంలో ***" ధ్యానాంధ్రప్రదేశ్ "*** కు ***చీఫ్ ఎడిటర్లు***గా అప్పట్లో ***J.K.భారవి, D.శివప్రసాద్, B.నాగలక్ష్మి ..*** మరి ఇప్పుడు ***M.స్వర్ణలత*** గార్ల సహకారం వల్ల పత్రిక విశిష్టరంగులను సంతరించుకుంది.

ఇక పత్రికను ఒక ఆకర్షణీయమైన దృశ్యకావ్యంగా మలచి మేటి పత్రికగా మనకు అందించడంలో తమ వంతు పాత్రలను పోషించిన **జ్యోతి, యుగంధర్, రోజీ**లు .. మరి ప్రస్తుతం పోషిస్తున్న ***D.సర్వేష్, V.సురేష్***లు ఎంతో అభినందనీయులు.

పత్రిక నిర్వహణలో మరి పంపిణీలో అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ .. పిరమిడ్ మాస్టర్స్ అందరికీ ఆత్మీయులుగా మారిన కార్యాలయ నిర్వహణ సిబ్బంది ***U.వెంకటేశ్, B.నాగప్రసన్న*** గార్లు అత్యంత ప్రశంసనీయులు.

అందరి పరస్పర సహకార కృషి ఫలితానికి నిలువెత్తు నిదర్శనంలా నిలుస్తున్న ***" ధ్యానాంధ్రప్రదేశ్ "*** ఇప్పుడు ***PSSM రజతోత్సవ సంబరాల*** శుభవేళ ***" ధ్యాన జగత్ "*** గా రూపుదిద్దుకుని మన ముందు సాక్షాత్కరించబోతోంది !!

***" ధ్యాన జగత్ జిందాబాద్ " .. " శాకాహార జగత్ జిందాబాద్ "***

***" పిరమిడ్ జగత్ జిందాబాద్ " .. " ఆత్మ విద్యా జగత్ జిందాబాద్ "***

***" ధ్యాన జగత్ " మాసపత్రిక*** కు ఆత్మీయ స్వాగతం పలుకుదాం !!



## ధ్యానమహాచక్రం-VI వర్కింగ్ కమిటీ .. నారాయణగూడ - హైదరాబాద్

# " పత్రీజీ జ్ఞానం .. ఆకాశమంత విశాలం "

– మేడమ్ స్వర్ణమాల పత్రి



2015 డిసెంబర్ నెల కడ్తాల్ .. కైలాసపురి **మహేశ్వర మహాపిరమిడ్ ప్రాంగణం**లో జరుపుకోబోయే **ధ్యానమహాచక్రం-VI** కార్యక్రమ వర్కింగ్ కమిటీ సమావేశం ఆగస్ట్ 25వ తేదీన హైదరాబాద్ .. హోటల్ **తాజ్‌మహల్**లో నిర్వహించబడింది.

### " పత్రి మేడమ్ యొక్క షష్ఠి పూర్తి "

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఉభయ రాష్ట్రాల వ్యాప్తంగా తరలి వచ్చిన పిరమిడ్ ధ్యానులు **బ్రహ్మర్షి పత్రీజీ** అమెరికా పర్యటనకు వెళ్తూన్నందున వారి సమక్షంలో ***మేడమ్ స్వర్ణమాల పత్రి గారి 60వ జన్మదినోత్సవ షష్ఠిపూర్తి (ఆగస్ట్ 31)సంబరాల***ను ఆగస్ట్ 25న అత్యంత ఆత్మీయంగా జరుపుకున్నారు.

### " మహా సందేశం "

**మేడమ్ స్వర్ణమాల పత్రి** గారు తమ సందేశాన్నిస్తూ .. " ప్రపంచాన్ని ధ్యానమయం చేయాలని 1979లో **పత్రీజీ** మొదలుపెట్టిన ధ్యానప్రచారం .. 1990 లో **పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్** ఆవిర్భావంతో మరింత వేగవంతం అయ్యింది. లక్షలాదిగా పిరమిడ్ మాస్టర్స్ ధ్యానంలోని శాస్త్రీయతను ఆచరణయుక్తంగా తెలుసుకుని తమ తమ జీవితాలలో వెలుగులను నింపుకుంటున్నారు. వారంతా కూడా పిరమిడ్ కుటుంబంలో భాగస్వాములుగా మారడం వల్ల ఈ రోజు **పిరమిడ్ ధ్యానప్రచారం** ఒక **ప్రపంచ వ్యాప్త ఉద్యమం**గా రూపుదిద్దుకుంది.

" పత్రీజీ నిర్వహిస్తూన్న ధ్యానప్రచారం ద్వారా ఎన్ని వేల కుటుంబాలు దుఃఖం నుంచి విముక్తి చెందాయో తలచుకుంటే నాకు చాలా సంతోషంగా ఉంటుంది. ధ్యానప్రచార కార్యక్రమాలలో పాల్గొనడానికి నేను ఆ యా ప్రదేశాలకు వెళ్ళినప్పుడు వాళ్ళు తమ తమ ధ్యాన జీవిత అనుభవాలను వివరిస్తూంటే నాకు ఆశ్చర్యంగా ఉంటుంది. ' నా కుటుంబం ' .. ' నా ఇల్లు ' .. ' నా పిల్లలు ' అంటూ పత్రీజీ ఆనాడు మమ్మల్నే పట్టుకుని కూర్చుని ఉంటే ఇన్ని లక్షల కుటుంబాలలో సంతోషం ఎలా నింపగలిగే వారు? ' అనుకున్నప్పుడు ధ్యానప్రచారం తొలినాళ్ళలో ఇద్దరు చిన్ని చిన్ని ఆడపిల్లలతో నేను పడిన బాధలన్నీ మర్చిపోతూంటాను.

" పత్రీజీని వాళ్ళంతా ఒక దేవుడిలా భావిస్తూంటే ' ఇల్లు పట్టకుండా తిరుగుతున్నాడు ' అని అప్పుడు బంధువులు అన్న సూటిపోటి మాటలను మరచిపోతూంటాను. ' ఇంత గొప్ప వ్యక్తికి భార్యకావడం నా అదృష్టం ' అని గర్వంగా అనుకుంటాను. ధ్యానప్రచారం కోసం వారు ఊరూరూ తిరుగుతూ .. ఎక్కడెక్కడో తింటూ ఎప్పుటికప్పుడు అక్కడ ఉన్న అసౌకర్యాలతో అడ్జస్ట్ అవుతూ ఈ వయస్సులో కూడా ఎండనక, వాననక అలా తిరుగుతూ ఉంటే మాత్రం భార్యగా నాకు చాలా బాధ కలుగుతూ ఉంటుంది.



స్వర్ణమాల పత్రి గారి కుటుంబం

" ధ్యానప్రచారం తొలినాళ్ళల్లో .. వారు ఎర్ర బస్సుల్లో నిలబడి ప్రయాణిస్తూ .. ప్లాట్‌ఫారాల మీద పడుకుంటూ ఎవరు ఎన్ని మాటలు అన్నా లెక్కచేయకుండా .. లక్ష్యం నుంచి తమ దృష్టిని మరల్చక పోయేవారు. వారు చేస్తోన్న కార్యక్రమం యొక్క గొప్పతనం మొదట్లో నేను కూడా అర్థం చేసుకోలేక పోయాను.

" అర్థాంతరంగా వారు ఉద్యోగానికి రాజీనామా చేయడంతో ఏర్పడ్డ ఆర్థిక ఇబ్బందులతో మరి బంధువులు అనే సూటిపోటి మాటలతో కుటుంబం గడవడవే కష్టం అనుకుంటే .. ' ధ్యానం నేర్చుకోవడానికి వచ్చిన వాళ్ళకు భోజనం పెట్టి పంపాలి ' అన్న వారి ఆదేశాన్ని ఎలా పాటించాలో అర్థంకాక సతమతమయ్యేదానిని. కానీ .. చివరికి అంతా సవ్యంగానే జరిగేది. నా స్థాయి అప్పుడు అంతే!

" నేను కూడా ధ్యానం చేయడం మొదలుపెట్టాక కానీ మా వారు చేస్తూన్న బృహత్తర కార్యక్రమంలోని గొప్పదనం మరి అందుకు వారు పడుతూన్న శ్రమ నాకు అర్థం కాలేదు! ప్రపంచదేశాలన్నీ తిరిగి పిరమిడ్ నిర్మాణాలు చేయిస్తూ .. ఎక్కడికక్కడ ధ్యానయజ్ఞాలు, ధ్యానమహాచక్రాలు జరిపిస్తూ క్రొత్త క్రొత్త వారికి ధ్యానాన్ని పరిచయం చేస్తూ వారు వాళ్ళ జీవితాలలో వెలుగులు నింపుతున్నారు.

" బెంగళూరు పిరమిడ్ వ్యాలీలో, కడ్తాల్-కైలాసపురిలో మెగా పిరమిడ్‌ల నిర్మాణం కోసం పత్రీజీ ఎంతగానో శ్రమించారు. దేశవ్యాప్తంగా నెలకొల్పబడిన పిరమిడ్ ఆశ్రమాలు ఈ రోజు వేలాదిమందికి ఆశ్రయం ఇస్తూ బాధితులను సేదదీరుస్తూన్నాయి.

" ఇరవై అయిదు సంవత్సరాల ఈ మహాప్రస్థానాన్ని ఒక్కసారిగా వెనక్కి తిరిగి చూసుకుంటే నాకు చాలా ఆనందంగా ఉంటుంది !!

" కేవలం ఒక్క వ్యక్తి ఒక మహాశక్తిలా మారి ఇవన్నీ చేయడం అద్భుతం! వారు ఎప్పుడూ తమ లక్ష్యంవైపు నడుస్తూనే ఉంటారు. ' నా వెనుక, ప్రక్కన ఎవరయినా వస్తున్నారా? ' అని కూడా చూసుకోరు. తమ నడక తాము సాగిస్తూనే ఉంటారు. ఒక్కోసారి ' అన్నీ తెలిసి కూడా మూర్ఖంగా ప్రవర్తించే కొందరు అనుచరులతో వారు ఎలా సర్దుకుపోతున్నారా? ' అని నేను ఆశ్చర్యపోతూంటాను.

" వారి జ్ఞానం ఆకాశమంత విశాలమైంది. ఆకాశం అంతటినీ మనం ఒకేసారి చూడలేం. మన చూపుకు ఉన్న పరిధిని బట్టే దాని వైశాల్యాన్నీ, ఎత్తునూ అంచనా వేస్తాం. అలాగే పత్రీజీని చూస్తూ ' అంతవరకే వారు ఉన్నారు ' అనుకోవడం అజ్ఞానం! మనం ఎంత



ఎత్తుకు ఎదిగినా వారు మనకు అందనంత ఎత్తుకు ఎదుగుతూనే ఉంటారు.

" ఒకసారి కైలాసానికి వెళ్ళిన ఋషులు, ఇతర దేవతలు అక్కడ ధ్యానం చేసుకుంటూన్న పరమశివుడిని చూసి ' అయ్యా! మేము మీ కోసం తపస్సు చేస్తూంటే మీరెవరికోసం తపస్సు చేస్తూన్నారు? ' అని అడిగారట ఆశ్చర్యంగా!

" దానికి శివుడు ' మీకు తెలిసిన వారిలో ఉన్నతమైంది శివుడు! అందుకని మీరు శివుడి కోసం తపిస్తూంటారు. నాకు ఆ పైవారి గురించి కూడా తెలుసు గనుక నేను వారి కోసం తపిస్తూ ఉంటాను ' అన్నాడట!

" అలా ' అందరినీ దుఃఖం నుంచి బయటికి తేవాలి ' అన్న లక్ష్యసిద్ధికి నిరంతరం శ్రమిస్తూ .. అపరిమిత సహనశక్తిని ప్రదర్శిస్తూన్న పత్రీజీని చూస్తూంటే మాస్టర్‌గా నాకు ఒక ప్రక్క గర్వంగానూ మరి భార్యగా మరోప్రక్క బాధగానూ ఉంటుంది! వారి ఆశయం త్వరగా సిద్ధించి .. వారు హాయిగా ఒకచోట పడుకోవాలంటే మీరంతా తిరగాలి! మీరంతా రెస్టుగా ఉంటే వారు తిరగాల్సి వస్తుంది కనుక ఇకనుంచి మీరంతా ' ధ్యానజగత్ ' ఆశయసాధన కోసం అవిశ్రాంతంగా తిరగాలి!

" ఒక ఆత్మజ్ఞానిలా ప్రతి ఒక్కరికీ ధ్యానవిద్యను ఉచితంగా అందిస్తూ .. వెళ్ళిన దగ్గరల్లా మీ ఆత్మజ్ఞాన వెలుగులను విరజిమ్మాలి! ' పిరమిడ్ మాస్టర్ ' అంటే సమాజానికి ఆదర్శంగా నిలవాలి!

" గురుదూషణలు .. గురువు పట్ల వెటకారంగా ప్రవర్తించడాలు .. ఒక ఆత్మజ్ఞాని చేయకూడని పనులు. అజ్ఞానులూ మరి మూర్ఖులూ చేసే గురుదూషణ వారిని జన్మ జన్మల పాపపంకిలంలోకి తోస్తే .. ఇక ఆత్మ జ్ఞానులూ మరి సత్యసాధకులూ చేసే గురుదూషణ వారి సాధనతో పాటు ఇతరుల సాధనను కూడా ఆటంకపరుస్తుందని శాస్త్రాలు మనకు తెలియజేస్తున్నాయి. ఇందుకు పురాణాల్లో మరి నిజజీవితంలో కూడా అనేకానేక ఉదాహరణలను మనం చూస్తూంటాం!



" గురువు మన పట్ల చూపే సహనాన్ని అలుసుగా తీసుకోకూడదు! అన్నీ తెలిసిన నిండుకుండ అయిన గురువు ముందు వినయాన్ని నటిస్తూ వారి వెనుక వ్యర్థప్రేలాపనలు చేయడం ఆధ్యాత్మిక సాధన అనిపించుకోదు! మనం ఈ భూమిమీదకు దేవుళ్ళలా దిగివచ్చాం! మానవ జీవిత అనుభవాలను పొందే క్రమంలో ఇంకా ఇంకా మన దైవత్వాన్ని ప్రకటింపజేసుకుంటూ సమాజంలోని వాళ్ళందరికీ ఆదర్శంగా ఉండాలి.

" ఆత్మ చైతన్య పరిణామక్రమాన్ని క్షుణ్ణంగా తెలుసుకున్న పిరమిడ్ మాస్టర్స్ అందరూ సమాజంలోని ఇతరులకు మార్గదర్శకులుగా ఉండాలి. సర్వస్వాన్నీ పణంగా పెట్టిన వారే ఇందులో విజయం సాధించ గలుగుతారు. ఏసుప్రభువు అంతటి వాడిదగ్గరే చిట్టచివరికి నిజమైన శిష్యులుగా పరిగణించబడిన వారుగా పన్నెండు మంది మాత్రమే మిగిలారు!

" ఆధ్యాత్మిక జీవితాన్ని గడపడం కత్తిమీద సాము లాంటిది కనుక గురువు దగ్గర జ్ఞానాన్ని వినయంతో స్వీకరించి వారి ఆంతర్యాన్ని కనుసన్నలతో గ్రహిస్తూ నడుచుకునే వాడే నిజమైన శిష్యుడు ! " అంటూ **PSSM** ఆవిర్భావం నుంచి ఇప్పటివరకూ సంస్థ అభివృద్ధికి ప్రత్యక్ష సాక్షిగా నిలిచిన స్వర్ణమాల పత్రి గారు తమ స్వీయ అంతరంగాన్ని అందరితో పంచుకున్నారు.

పత్రీజీ అడుగుజాడల్లో నడుస్తూ ధ్యాన ప్రచార మహోద్యమంలో తమ వంతు ఉదాత్త పాత్రను పోషిస్తూ వచ్చిన ధర్మమూర్తి " పత్రీ మేడమ్ " .. సంస్థకు అందించిన సేవలను పిరమిడ్ మాస్టర్లు మరొక్క సారి గుర్తు చేసుకున్నారు.




పత్రీజీతో మహమ్మద్ అస్లమ్ గారు

## "మహమ్మద్ అస్లమ్ గారి సందేశం"

పిరమిడ్ బృహత్ కుటుంబానికి తల్లి అయిన పత్రి మేడమ్ గారి సందేశాన్ని పత్రి ఒక్కరూ శిరోధార్యంగా చేసుకోవాలని కోరుతూ ఆనాటి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హైదరాబాద్ .. మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ అస్లమ్ గారు ..

" ' ధ్యానం ' లోని శాస్త్రీయతను నేను ఈ మధ్యనే స్వయంగా అనుభవం చెందాను. ఒక రాజకీయ నాయకుడిగా నేను అనేకానేక పని ఒత్తిళ్ళతో సతమతమవుతూ అధిక రక్తపోటుకు గురి అయ్యాను. ఎందరెందరో డాక్టర్ల చుట్టూ తిరిగి మందులతో విసిగిపోయి యోగా నేర్చుకోవడానికి నెలకు 15,000 రూ॥ వెచ్చించి మరీ యోగా టీచర్‌ను నియమించుకున్నాను.

" ఆసనాలు వెయ్యడం వల్ల నా రక్తపోటు మరింత పెరిగి .. ఏం చెయ్యాలో దిక్కుతోచక ఉన్నప్పుడు శాలివాహన నగర్‌లో పిరమిడ్ ధ్యానమందిరం బోర్డు కనపడింది. ' ఏంటో తెలుసుకుందాం ' అనుకుని లోపలికి వెళ్ళిచూడగా అది ' ధ్యాన జగత్ ' పత్రిక ఆఫీస్!

" అక్కడ ఉన్న మెడిటేషన్ రూమ్‌లో D.కేశవరాజు గారు నన్ను కూర్చోబెట్టి నాతో ధ్యానం చేయించారు. పత్రీజీ వేణునాదం వింటూ అరగంట ధ్యానం చేసే సరికే నేను కొంత మేరకు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాను. క్రమం తప్పకుండా ప్రతిరోజూ అక్కడికి వెళ్ళి ధ్యానం చేసుకుని 15 రోజుల్లోనే నా రక్తపోటును నియంత్రణలోకి తెచ్చుకున్నాను.

" దాంతో నేను ' వైద్యరంగానికి కూడా అందని గొప్ప శాస్త్రీయత ధ్యానంలో ఉంది కనుక దానిని నా జీవితంలో విడువకూడదు! ' అని నిర్ణయించుకున్నాను. నా నియోజకవర్గ పరిధిలోనే ఇంత గొప్ప ధ్యానమందిరం ఉన్నా .. ఇంత గొప్ప గురువు నా ప్రక్కనే ఉన్నా .. నేను ఎన్నో సార్లు ఆ మార్గంలో తిరిగినా .. ' చేరవలసిన సమయంలోనే నేను వారిని చేరుకున్నాను ' అని తెలిసింది.

" ఒక ముస్లిం అయి ఉండి కూడా నేను ఇప్పటి వరకు నా నియోజకవర్గ పరిధిలో కొన్ని కోట్లు ఖర్చుపెట్టి ప్రార్థనామందిరాలూ, గుళ్ళూ, గోపురాలూ మరి హిందూ స్మశానవాటికను కట్టించాను. ఇక్కడికి వచ్చిన వాళ్ళు అక్కడికి వెళ్ళరు; అక్కడికి వెళ్ళిన వాళ్ళు ఇక్కడికి రారు! దాంతో కుల మత స్థాయీ బేధాలకు అతీతంగా పత్రిగారు నిర్మింపజేస్తున్న పిరమిడ్‌లు నాకు ఎంతగానో నచ్చి .. కడ్తాల్ ఉన్న మహేశ్వర మహాపిరమిడ్‌ను దర్శించాను.

" ఇప్పుడు నేను కూడా హైదరాబాద్‌లో ఒక గొప్ప పిరమిడ్‌ను నిర్మించాలని నిర్ణయించు కున్నాను. వెంటనే దానిని కార్యరూపంలో పెట్టి త్వరలోనే గురువు గారితో దాని గురించి చర్చిస్తాను.

" ఇప్పుడు నేను కూడా పిరమిడ్ కుటుంబంలో ఒక సభ్యుడిని. నాలాంటి వేలమంది అస్లమ్‌లను తయారు చేయగల శక్తిసంపన్నులయిన గురువుగారు నన్ను ఏ పని చేయమని ఆదేశించినా .. చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను " అంటూ అత్యంత స్ఫూర్తిదాయకంగా తమ సందేశాన్ని ఇచ్చారు.

అనంతరం నవ్యయుగ ఆధ్యాత్మిక మాసపత్రిక "ధ్యాన జగత్" బ్యానర్‌ను మరి పిరమిడ్ నిత్యాన్నదాన ట్రస్ట్ బ్రోచర్‌ను ఆవిష్కరించిన పత్రీజీ అందరిచే హర్షధ్వానాలు పలికించారు.

పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ (హైదరాబాద్) వారిచే నిర్వహించబడిన ఆనాటి కార్యక్రమంలో పిరమిడ్ నిత్యాన్నదాన ట్రస్ట్ వారిచే అందరికీ ఫలహారాలు అందించబడ్డాయి !!

రిపోర్ట్ : " ధ్యాన జగత్ "